క్లుప్తంగా

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి

గరుగుబిల్లి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని స్థానిక పంచాయతీ సర్పంచ్ కె.ఇందుమతి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో సోమవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 24 నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు వీలైనన్ని ఎక్కువ సర్వీసులు అందించాలన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని వాటిని సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసి సమస్య పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.జగదీష్, వెల్ఫేర్ అసిస్టెంట్ పి.మన్మథరావు తదితరులున్నారు.

అగ్నిప్రమాద నష్టం అంచనా

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలసలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాద స్థలాన్ని రెవెన్యూ అధికారులు సోమవారం పరిశీలించారు. బాధితులతో మాట్లాడి జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన బోను రామారావు, రామస్వామి, పోలినాయుడు, శంకరరావు, సీతంనాయుడు, సింహాచలం, శంకరరావు, తదితరుల పశువుల శాలలు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతైన విషయం పాఠకులకు విదితమే. ఈ మేరకు ఆర్ఐ ఎం.కృష్ణ, వీఆర్ఓ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి టి.భాస్కరరావు నష్టాన్ని అంచనా వేసి తహసీల్దార్ లక్ష్మీకుమార్‌కు నివేదించారు.

శాస్త్రవేత్తలుగా ఎదగాలి

పాలకొండ రూరల్: విద్యార్థులు వారు ఎంచుకున్న రంగంలో ఎనలేని కృషిచేసి శాస్త్రవేత్తలుగా ఎదగాలని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.జనార్దననాయుడు అన్నారు. జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని చేరుకునేందుకు ప్రణాళికతో కృషిచేయాలని సూచించారు. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ శాస్త్రవేత్త డాక్టర్ రఘుప్రకాష్ ఆక్వాకల్చర్‌లో వస్తున్న సాంకేతిక మార్పులు, మత్స్య సంపద సేకరణకు ఉపయోగిస్తున్న పలు విధానాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రభాకరరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ బి.రాజు, అధ్యాపకులు వి.జనార్దనరావు, పి.ఉపేంద్ర తదితరులున్నారు.

నేడు శ్రీవారి ఆలయంలో అభిషేకాలు

సీతంపేట: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేయనున్నారు. ఆలయానికి మహా సంప్రోక్షణ జరిగి 40 రోజులు పూర్తయినందున పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.


వేతన బకాయిలు చెల్లించాలని వినతి

పాలకొండ: స్వచ్ఛ భారత్ కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఇన్‌చార్జి ఎంపీడీఓ తినాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు దావాల రమణారావు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అందిస్తున్న రూ.6 వేలను ప్రతీ నెల చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గుళిరాగి సాగుతో రైతుల ఆదాయం మెరుగు

సీతంపేట: గుళిరాగి సాగుతో రైతుల ఆదాయం మెరుగుపడుతుందని ప్రకృతి వ్యవసాయం రీజనల్ ఆఫీసర్ ప్రకాశరావు అన్నారు. మండలంలోని మల్లి, చిన్నబగ్గ గ్రామాల్లో సోమవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కషాయాల తయారీలో శిక్షణ ఇచ్చారు. నారుమడుల పెంపకంలో మెళకువలు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు హేమసుందర్, ఎస్ఆర్పీ దేవుళ్లు, సింహబలుడు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల గుర్తింపునకు ప్రత్యేక సర్వే



4వ వార్డులో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

పాలకొండ: నగరపంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం అమలుకు సంబంధించి అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని 4వ వార్డులో కౌన్సిలర్ కె.గంగునాయుడు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుపై సర్వే చేపట్టారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఆయా సమస్యలకు పరిష్కారం చూపనున్నారు.

అన్నదాత సేవలో ఆర్‌బీకేలు

- విత్తనం మొదలుకొని పంట విక్రయం వరకు అన్ని సేవలు ఆర్‌బీకేల్లోనే..
- కియోస్క్‌ల ద్వారా అందుబాటులో సమగ్ర సాగు సమచారం
- నియోజకవర్గంలో 93 రైతుభరోసా కేంద్రాలు
- సర్కారు సాయంతో పండగలా మారిన వ్యవసాయం



పాలకొండలో ఏర్పాటుచేసిన మాస్టర్ హబ్ (రైతుభరోసా కేంద్రం)

పాలకొండ రూరల్: వ్యవసాయం దండగ అని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయ రంగాన్ని గాలికొదిలేసి అన్నదాత ఆత్మహత్యలకు కారణమయితే.. అందరికీ అన్నం పెట్టే అన్నదాత క్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను ప్రోత్సహిస్తూ రైతును రారాజుగా చేసేందుకు కృషిచేస్తున్నారు. వైఎస్సార్ రైతుభరోసా కింద రైతులకు ఏటా రూ.13500 పెట్టుబడి సాయం అందించడంతో పాటు రాయితీపై నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్రపరికరాలను అందిస్తున్నారు. రైతులకు అవసరమైన అన్ని సేవలను గ్రామస్థాయిలోనే అందించేందుకు ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పాలకొండ నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 93 ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి రైతులకు మెరుగైన సేవలందిస్తున్నారు.

అన్ని సేవలూ ఆర్‌బీకేల్లోనే..

ఖరీఫ్, రబీ సీజన్ ఏదైనా.. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు మొదలుకొని పండిన పంట విక్రయాల వరకు అన్ని సేవలను ఆర్‌బీకేల్లోనే పొందవచ్చు. నాశిరకం విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి రైతులు మోసపోకుండా ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వమే నాణ్యమైన విత్తనాలు, ఎరువులను రాయితీపై అందిస్తోంది. నిరుద్యోగ యువతకు ఆర్‌బీకేల్లో గ్రామ వ్యవసాయ సహాయకులుగా నియమించి ఉపాధి కల్పించింది. వీరు రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సేవలందిస్తారు. వాతావరణ పరిస్థితులు, భూసార పరీక్షలకు అనుగుణంగా ఏ పంటలు సాగు చేయాలి, ఎరువులు ఎంత మోతాదులో వినియోగించాలి తదితర అంశాలతో పాటు ఆధునిక సాగు పద్ధతులు, నీటియాజమాన్య పద్ధతులు, నూతన సాంకేతికతను వ్యవసాయంలో ఏ విధంగా వినియోగించుకోవాలి తదితర అంశాలపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తారు. సాగులో ఉన్న పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించడం ద్వారా ఉచిత పంటబీమా సౌకర్యం వర్తిస్తుంది. పండిన పంటను ఆర్‌బీకేల ద్వారా మద్దతుధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల సేవలు కూడా ఆర్‌బీకేల్లో లభిస్తాయి.

కియోస్క్‌ల ఏర్పాటుతో డిజిటల్ సేవలు

ఆర్‌బీకేల్లో ఏర్పాటుచేసిన కియోస్క్‌ల ద్వారా డిజిటల్ సేవలు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. ఈ యంత్రాలపై ఉన్న స్క్రీన్‌ను వేలితో తాకి, ఫోన్ నంబర్ ఎంటర్ చేయటంతో వివిధ కంపెనీలకు చెందిన రకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పశువుల దాణా తదితర వివరాలు ధరలతో సహా కనిపిస్తాయి. రైతులు వారికి నచ్చిన వాటిని ఎంపిక చేసుకుని కొనుగోలు చేసుకోవచ్చు. అలాగే వ్యవసాయం, చీడపీడల నివారణ, వాతావరణ సంబంధిత సమాచారాన్ని రైతులు సులభంగా తెలుసుకోవచ్చు. భూ రికార్డులు, వివిధ పంటల సాగు, సాంకేతిక మెలకువలు కియోస్క్ స్క్రీన్‌పై చూడవచ్చు.

నియోజకవర్గంలో..

మండలం పేరు	రైతులు	ఆర్‌బీకేలు	సాగువిస్తీర్ణం (హెక్టార్లలో)	అందించిన విత్తనాలు (క్వింటాళ్లలో)	తాజా రైతుభరోసా పొందిన రైతులు
పాలకొండ	11,208	24	8,367	744	9,221
వీరఘట్టం	12,809	24	9,102	1918	10,560
సీతంపేట	13,906	29	5,108	1480	13,209
భామిని	10,302	16	6,204	1455	7,241

ఎటువంటి కష్టం లేకుండా..



గడిచిన నాలుగేళ్లగా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి. ఎటువంటి కష్టం లేకుండా గ్రామంలో విత్తనాలు, ఎరువులు లభిస్తున్నాయి. అధికారులు సహకారం లభిస్తోంది. గతంలో విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు మండల కేంద్రం లేక ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో సమయం, డబ్బు వృథా అయ్యేది. ఇప్పుడు ఆ సమస్య లేదు. పెట్టుబడి సాయాన్ని కూడా ప్రభుత్వమే అందిస్తోంది.

– బలగ మన్మథరావు, రైతు, సింగన్నవలస, పాలకొండ మండలం

అందుబాటులో సమగ్ర సమాచారం



రైతుభరోసా కేంద్రాల ఏర్పాటుతో సమగ్ర సమాచారం అక్కడే లభిస్తోంది. ఉన్నచోటనే విత్తనాలు, ఎరువులు, సేద్యానికి అవసరమైన యంత్ర పరికరాలు లభిస్తున్నాయి. అధికారుల అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు అందిస్తున్నారు. వ్యవసాయంతో పాటు పాడి, మత్స్యకార రంగాలకు చెందిన రైతులకు అనేక సేవలు అందిస్తున్నారు. ఆర్‌బీకేలు అందుబాటులోకి రావటంతో రైతులు నిశ్చింతగా పొలంబాట పడుతున్నారు.

– బోనుమంతు సోమశేఖరరావు, రైతు, పాలకొండ

శరవేగంగా గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం



కళాశాల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, తదితరులు

కురుపాం: కురుపాం పంచాయతీ పరిధి టేకరఖండి గిరిజన గ్రామ సమీపంలో జరుగుతున్న గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి సోమవారం పరిశీలించారు. పనుల పురోగతిపై అక్కడ ఉన్న సిబ్బంది వద్ద ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన యువతకు మెరుగైన ఉన్నత విద్యను అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణానికి రూ.153 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆ నిధులతో సుమారు 105 ఎకరాల్లో కళాశాల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలిపారు. ఆమె వెంట ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, స్థానిక సర్పంచ్ గార్ల సుజాత, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయ్, మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, శెట్టి నాగేశ్వరరావు, అంధవరపు కోటేశ్వరరావు, షేక్ నూరెళ్ల, తదితరులు ఉన్నారు.

చురుగ్గా పైపులైన్ల ఏర్పాటు

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలో నూతనంగా ఏర్పడిన కాలనీలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక నాగవంశపువీధి సమీపంలో ఉన్న పలు కాలనీలకు తాగునీరు అందించేందుకు సోమవారం పైపులైన్ పనులు చేపట్టారు. కౌన్సిలర్లు కొంచాడ అరుణ్‌కుమార్, పల్లా ధనలక్ష్మి పనులను పర్యవేక్షించారు. వారం రోజుల్లో పనులు పూర్తిచేసి పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తామని నగరపంచాయతీ ఏఈ దేవీవరప్రసాద్ తెలిపారు. అలాగే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లో పూడికల తొలగింపునకు చర్యలు తీసుకున్నామన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహకం



గరుగుబిల్లి: విద్యార్థులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ బాపూజీనాయుడు



పాలకొండ రూరల్: విద్యార్థులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

గరుగుబిల్లి: పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం కింద ప్రభుత్వం నగదు ప్రోత్సాహకం అందిస్తోంది. గరుగుబిల్లి మండలం నాగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు పాల్గొని ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించారు. నగదు ప్రోత్సాహకంతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యాకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, నాడు-నేడు పథకం కింద పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు కె.అచ్యుతరావు, ఎం.గౌరునాయుడు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

- పాలకొండ రూరల్: ఎం.సింగుపురం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఆనందరావు ఆధ్వర్యంలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సర్పంచ్ రణస్థలం రమాదేవి, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంతో సత్కరించారు.



భామిని: బత్తిలి ఉన్నత పాఠశాలలో సత్కారాలు పొందిన విద్యార్థులతో సర్పంచ్ శాంతికుమారి, సింహాచలం

– భామిని: బత్తిలి జెడ్పీహెచ్‌ఎస్, భామిని ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మాజీ ఎంపీపీ టింగ శాంతికుమారి, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, పార్టీ నాయకుడు బొడ్డేపల్లి ప్రసాద్ తదితరులు సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలనే గొప్ప ఆశయంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిభా పురస్కారాలతో ప్రోత్సాహిస్తున్నారన్నారు.

ఉపాధ్యాయుడిపై ఎంఈఓకు ఫిర్యాదు

గరుగుబిల్లి: మండలంలోని సాంబన్నవలస పాఠశాల ఉపాధ్యాయుడిపై గ్రామానికి చెందిన కె.బలరాంనాయుడు ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. పాఠశాలకు విద్యార్థులు రాకపోవడంతో తరగతి గది తలుపులు వేసుకుని సెల్‌ఫోన్ చూసుకుంటున్నారని, దీన్ని ప్రశ్నించిన తమపై దుర్భాషలాడుతూ వాగ్వాదానికి దిగుతున్నారని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సదరు ఉపాధ్యాయుడు తనపై కావాలనే బలరాంనాయుడు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, గతంలో కూడా ఇదే తరహాలో వేధింపులకు పాల్పడ్డారని అన్నారు. దీనిపై ఎంఈఓ ఎస్.నాగభూషణరావు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

భామిని: మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై యతిరాజుల అమ్మనరావు హెచ్చరించారు. బత్తిలి బస్టాండ్ సమీపంలో సోమవారం సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడిపేవారిపై అపరాధ రుసుం విధించారు. మద్యం తాగి డ్రైవ్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. రోడ్డు భద్రత నిబంధనలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంకిత భావంతో సర్వే చేపట్టాలి

పాలకొండ రూరల్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అంకిత భావంతో నిర్వహించాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ డొంక త్రినాథులతో కలిసి గ్రామ రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ సహాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది వారి పరిధిలో ఉన్న గ్రామ వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. నిర్ణీత సమయంలోగా వాటిని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్, ఈఓపీఆర్డీ నేతృత్వంలో ఒక బృందం, ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ పర్యవేక్షణలో మరో బృందం మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో సర్వే పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఏ ఒక్క గృహం విడిచిపెట్టకుండా ప్రతీ ఇంటల్లో సర్వే జరగాలన్నారు.



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

గిరిజన స్పందనకు 70 వినతులు



వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 70 వినతులు వచ్చాయి. తమ భూములు కొంతమంది ఆక్రమించుకున్నారని పూనుపేట గిరిజనులతో పాటు గిరిజన సంక్షేమ సంఘం నాయకులు వాబయోగి ఫిర్యాదు చేశారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని అధికారులను కోరారు. మనుమకొండకు చెందిన రేఖ సీఆర్‌టీ పోస్టు ఇప్పించాలని, రింపికి చెందిన చంద్రశేఖర్ ఆటో కొనుగోలుకు రుణం మంజూరు చేయాలని, భామినికి చెందిన భారతి హెల్త్ వర్కర్ పోస్టు ఇప్పించాలని కోరుతూ వినతులు అందజేశారు. వీటితో పాటు పలు వినతులు అందాయి. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, ఉపసంచాలకులు శ్రీనివాసరావు, ఏఎంఓ కోటిబాబు, పీఏఓ హరికృష్ణ, సీడీపీఓలు రంగలక్ష్మి, విమలారాణి, హెచ్ఓలు అమరేశ్వరి, ఆయంతి, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న గిరిజన సంఘ రాష్ట్ర నాయకులు

పాలకొండ రూరల్: ప్రజా ఉద్యమాలతోనే ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయని గిరిజన సంఘ అధ్యక్షుడు ఉర్లక త్రినాథ్ అన్నారు. పాలకొండలో గిరిజన సంఘం ప్రాంతీయ సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు ఉద్యమాల ఆవశ్యకతను వివరించారు. దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూ సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించకపోగా గిరిజనులను పోలీసుల సాయంతో నిర్బంధాలకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి గిరిజనులంతా సంఘటితం కావాలని తిమ్మక్క, వరహాలు పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్రంలోని పలు జిల్లాకు చెందిన గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ చేపట్టారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన



మాట్లాడుతున్న సర్పంచ్ మన్మథరావు

కురుపాం: సంసద్ ఆదర్శ్ గ్రామయోజను సద్వినియోగం చేసుకుందామని నీలకంఠాపురం గ్రామ సర్పంచ్ అడ్డాకుల మన్మథరావు, గ్రామ ప్రజలు, పలువురు ప్రజా ప్రతినిధులు తీర్మాణం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో సంసద్ ఆదర్శ్ గ్రామ యోజన కింద నీలకంఠాపురం గ్రామం ఎంపికకాగా, గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో సీసీరోడ్లు, రిటర్నింగ్ వాల్, కమ్యూనిటీ హాల్, సులభ్ కాంప్లెక్స్‌తో పాటు పలు మౌలిక వసతులు అవసరమున్నట్లు గుర్తించారు. గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి జిల్లా అధికారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, ఎంపీటీసీ రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి పార్వతీ పాల్గొన్నారు.

రథయాత్ర ఏర్పాట్లు పూర్తి



వీరఘట్టం: యాత్రకు ముస్తాబైన రథం

పాలకొండ: జగన్నథస్వామి రథయాత్ర ఉత్సవాలను సజావుగా నిర్వహించాలని దేవాదాయశాఖ డీసీ సుజాత సూచించారు. స్థానిక జగన్నాథస్వామి ఆలయాన్ని సోమవారం ఆమె సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథయాత్ర ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఈఓ వి.రాధాకృష్ణకు సూచించారు. రథాన్ని పరిశీలించి అలంకరణకు సంబంధించి పలు సూచనలు చేశారు.

- వీరఘట్టం: మండల కేంద్రంలో ఏటా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవాలను ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 20 నుంచి 28 వరకు ఉత్సవాలు జరగనున్నాయని దేవాదాయశాఖ ఈఓ వి.రాధాకృష్ణ, అర్చకులు లింగరాజ్‌రథో తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక మందిరం వీధిలో వెలసిన జగన్నాథస్వామి ఆలయాన్ని సోమవారం సంప్రోక్షణ చేశారు. అనంతరం స్వామి వారికి నేత్రోత్సవం నిర్వహించారు. మంగళవారం స్వామి రథయాత్ర ప్రారంభం అవుతుందని అర్చకులు తెలిపారు. 24న హిరాపంచమి అనంతరం 28న మారు రథయాత్ర జరుగుతుంది.

ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు



రాహుల్ గాంధీ పుట్టినరజు వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలను గుమ్మలక్ష్మీపురంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు నిమ్మక సింహాచలం ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి స్థానికులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ వైజాగ్ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్, ఎస్‌బీఐ, ఎల్ఐసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకోవడంతో పాటు, లౌకికవాద దేశంలో మతోన్మాద సిద్ధాంతాలతో పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, రాహుల్ గాంధీని ప్రధాని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దుడ్డుఖల్లు సర్పంచ్ నిమ్మక నీలావతి, మాజీ సర్పంచ్ కడ్రక క్రిష్టారావు, నాయకులు కిల్లక పకీరు, కిశోర్, రాఘవేంద్ర తదితరులున్నారు.

ఎంఈఓ-2 బాధ్యతల స్వీకరణ



ఆర్.ఆనందరావు



డి.సూర్యచందరరావు



యు.భాస్కరరావు



కె.సోంబాబు



ఎం.శ్రీనివాసరావు

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో హెచ్‌ఎం నుంచి ఎంఈఓ-2గా పదోన్నతి పొందిన వారంతా సోమవారం విధుల్లో చేరారు. వీరఘట్టం నుంచి రాగోలు ఆనందరావు, సీతంపేట నుంచి దిబ్బ సూర్యచంద్రరరావు, భామిని నుంచి ఊయక భాస్కరరావు, పాలకొండ నుంచి కురిటి సోంబాబు ఎంఈఓ-2గా పదోన్నతి పొందారు. వారికి పలువురు ఉపాధ్యాయులు, ఎంఈఓ కార్యాలయం సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ఎంఈఓ-2గా శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: ఎంఈఓ-2గా ముదిలి శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జియ్యమ్మవలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ ఇటీవలే రావివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం ఎంఈఓ-2గా పదోన్నతి రావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.